# గాంధీజి శక్తి ప్రజాశక్తి

రచన శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు

"అసంఖ్యాకులైన భారతీయులకు నేను ప్రతినిధినైనానంటే ఆ అధికారాన్ని నేను కష్టపడి సాధించుకున్నాను", అని గాంధీజీ ఒకప్పుడు చెప్పారు.

గాంధీజీ సాగించిన రాజకీయోద్యమాలేగాక ఆయన కొల్లాయిగుడ్డా, అల్పాహారమూ, ప్రకృతివైద్యమూ, పేదరికమూ మొదలైనవికూడా భారత ప్రజానీకానికి ఆయనని ప్రతినిధి చేశాయి.

కోటీశ్వరులూ, ప్రభువులూ, నాయకులూ, రాజకీయ తంత్రజ్ఞులూ ఆయన దర్శనం చేసుకున్నప్పుడల్లా ప్రజల దర్శనం చేసుకున్నారు.

గాంధీజీని నిత్యమూ చుట్టుముట్టిన వాళ్లంతా గాంధీజీ సిద్ధాంతాలను అర్థంచేసుకున్న వాళ్లనుకోవటం భ్రమ. కోటీశ్వరులకూ, ప్రజలని దోపిడీచేసేవాళ్లకూ, అధికార వ్యామోహితులకూ గాంధీ భక్తులని చెప్పుకునే అధికారం లేదు. ఖరీదైన కార్లలో గాంధీ దర్శనం చేయబోయినవారంతా, గాంధీలో ఉన్నది ప్రజాశక్తి కనకనే వెళ్లారు.

దాదాపు 20 ఏళ్లక్రితం నేను కాశీ విశ్వవిద్యాలయంలో చదువుతుండగా యాజ్ఞిక్ అనే ఆయన మా బ్లాకుకు వార్డెన్‌గా ఉండేవాడు. ఆయన హిందూ మతాభిమాని. ఆ రోజుల్లో గాంధీజీ కాశీవచ్చి మా విశ్వవిద్యాలయానికి కూడా రానున్నారు. మాతో మా వార్డెన్ గాంధీజీ "గో హత్య" చేశాడుగనక హిందువుకాడనీ, ఊళ్లోఉన్న హిందూ మతాభిమానులందరూ గాంధీజీకి నల్ల జండాలు చూపుతున్నారనీ చెప్పాడు. తానుకూడా వాళ్లతోపాటు నల్లజండాలు చూపుతానన్నాడు. ఆ రోజు ఉదయం యాజ్ఞిక్ ఏమిచేసిందీ నాకు తెలియదు. కాని ఆ సాయంకాలం విశ్వవిద్యాలయంలో గాంధీజీకోసం పెట్టిన మీటింగులో యాజ్ఞిక్ గాంధీపాదాలు తగులుతూ కూర్చుని ఉండటం మేమంతా చూశాం.

గాంధీజీలో వ్యక్తిగతమైన ఒక ఆకర్షణశక్తి ఉందనీ, అది అందర్నీ వివశులను చేస్తుందనీ చెప్పవచ్చు. కాని యాజ్ఞిక్ గాంధీజీని గురించి తన విశ్వాసాలు మార్చుకున్నాడనుకోను. వీధిలో ఏదన్నా ప్రమాదం జరిగితే ఆగిచూడకుండా ఉండటం ఎంత అసాధ్యమో గాంధీజీ దగ్గిరికి వెళ్లకుండా ఉండటం అంత అసాధ్యం.

గాంధీజీని నిత్యమూ చుట్టుముట్టినవాళ్లు ఆయనలో ఉన్న ఈ శక్తికి గురి అయారేగాని ఆయనని అర్థం చేసుకోలేదు. ఈ దరిద్రనారాయణుడు కోటీశ్వరులకే దర్శనం ఇచ్చాడు. ఈ హిందూ మతాభిమాని మతసామరస్యం కోసమే ప్రాణత్యాగం చేశాడు. ఇందులో అర్థం ఉంది.

ఈ అర్థం భజనల ద్వారానూ, బొల్లిఏడుపుల ద్వారానూ వ్యక్తం కాబోదు. "ఒక మహాపురుషుడికోసం దేశమంతా దుఃఖసాగరంలో మునిగిపోయింది." నిజమేకాని ఈ మహాపురుషుణ్ణి హత్యచెయ్యటానికి దేశం అన్నిమూలలో కుట్ర సాగింది. ఈ మహాపురుషుడి చావు గురించి ముందుగానే కరపత్రాలు తయారు చేయబడ్డాయి. ఈ అశుభవార్త కోసం టెలిఫోనులవద్ద కొందరు ఆత్రంగా వేచికూచున్నారు. ఈ మహాపురుషుడు చచ్చిపోగానే సంతోషంగా మిఠాయి పంచుకున్నారు. దేశంలో అనేకవేలమందికి—లక్షలమందికి—ఈ మహాత్ముడి చావు అత్యవసరమయింది.

ఎందుచేత? ఈ లక్షలమంది రక్తదాహానికి ఒక్కమనిషి అడ్డంగా నిలబడ్డాడు. సాంఘిక వాతావరణమూ, రాజకీయ వాతావరణమూ ప్రజాద్రోహులకు అనుకూలంగా ఉన్నాయి. జీవితంలో కుళ్లు హెచ్చింది. కుళ్లులోనుంచి క్రిములురాక ఏం చేస్తాయి? ప్రజాక్షేమానికి అనర్థదాయకమైన పరిస్థితులు సాగించగలందులకు గాంధీజీ హత్యకావటంలో నాకెంతో అర్థం స్ఫురిస్తుంది. దేశంలో ఉన్న శ్రామికులూ, దరిద్రులూ, అనాథలూ సుఖపడేటందుకు రాజకీయవేత్తలు ఏం చేశారు?

## గాంధీజీ శక్తి ప్రజాశక్తి

స్వరాజ్యం వచ్చినాక ఈ ప్రజాసామాన్యానికి జీవితం మరింత దుర్భరమయింది. తుపాకులు సర్వసామాన్యమైనాయి. అహింస ఏనాడో చచ్చింది. సత్యాన్ని లోతుగా పాతేశాం. ప్రజాక్షేమానికి హానికలిగించే గుత్త పెట్టుబడిదార్లు, నరపాలకులూ అదుపుచేయబడలేదు. ఉద్యోగం కావాలనటం, తిండి కావాలనటం, బట్ట కావాలనటం దేశద్రోహమయింది. సాంఘికదోపిడి—అటువంటిది ఉందనే జ్ఞానంకూడా లేనట్టుగా మనం ప్రవర్తిస్తున్నాం—అది ఇప్పుడు విజృంభించింది. ఈ దేశంలో ఈనాడు సామాన్య మానవుడై జీవించటంకంటె హేయమైనదిలేదు. ఈ వాతావరణంలో గాంధీజీ చావవలిసి వచ్చింది.

"నేను గాంధీజీవారసుణ్ణి" అని చెప్పుకోగల ఒక రాజకీయవాది గాని ఒకరాజకీయ సంస్థగాని దేశంలో లేదు. గాంధీజీకి వారసులు నిరుపేదలు, అనాథలు, అశక్తులు, స్త్రీలు, పిల్లలు.

అధర్మం ప్రబలి ధర్మచ్యుతి జరిగినప్పుడు అవతార పురుషుడు జన్మించి దుష్టులను శిక్షించి శిష్టరక్షణ చేస్తాడనేది కల్ల. కృష్ణుడు నీచకిరాతకుడిచేతిలో చచ్చాడు. గాంధీజీని చంపటానికి మరొక పరమకిరాతకుడు కావలిసివచ్చింది. తనను నాశనంచేసిన అధర్మం ఎటువంటిదో ప్రజలకు చూపటానికే అవతార పురుషులు ఉపకరిస్తారు. గాంధీజీ మనకు తన మృతిద్వారా హిందూ మతావేశపరుల నగ్న స్వరూపం చూపగలిగారు.

గాంధీజీ ఆత్మకు శాంతి కలగాలంటే రాజకీయవాదులూ దేశనాయకులూ గాంధీజీ హత్యానేరాన్ని తమమీద వేసుకోవాలి. దేశాన్ని ప్రజల పరంచేయాలి. రాజ్యాన్ని అనాథల అతినికృష్టుల రాజ్యం చేయాలి. ధనికుల అధిక లాభాలకోసం ప్రజలు బలికావటం అంతంకావాలి. ఆదర్శరహితమైన గూడు పుఠాణీ రాజకీయాలూ ప్రజల జీవితంలో స్థానంలేని మత సంపర్కాలూ తక్షణం నిర్మూలం కావాలి.

అదే దేశానికి విముక్తి మార్గం. ఆ మార్గం తొక్కితేనే గాంధీజీ మృతికి ఒక అర్థం ఏర్పడుతుంది.

★




వాడుతూండే ప్రతి ఒక్కరి

నిశ్చితాభిప్రాయము

జాబ్కో

ఫౌంటెన్ ఇంక్

ఉపయోగించి వ్రాస్తూంటే

ఎంతో ముచ్చటగా ఉంటుందని !

అయిదురంగుల్లో దొరుకుతుంది

బ్లూ బ్లాక్ — బ్లూ

రెడ్—వైలెట్—గ్రీన్

★

జయ భారతం కంపెని

మదరాసు · బెంగుళూరు . ఎర్నాకులము